క్లుప్తంగా

ఫిజియోథెరపీతో ఆరోగ్యం



రక్తదానం చేస్తున్న ఫిజియోథెరపిస్టులు

జగిత్యాల: ప్రమాదాలకు గురైనప్పుడు చికిత్స అనంతరం ప్రతీ ఒక్కరు చికిత్స చేయించుకోవాలని ఫిజియోథెరపి వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌కుమార్ అన్నారు. ఫిజియోథెరపీ డే సందర్భంగా జగిత్యాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదం జరిగిన ప్రతీ ఒక్కరు ఫిజియోథెరపీ చేయించుకోకపోవడంతో ఆపరేషన్ జరిగిన చోట ఇబ్బందులు ఎదురవుతాయని, తప్పకుండా ఫిజియోథెరపి చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇందూరు అనిల్‌కుమార్, యాకూబ్, విజయ్‌చరణ్, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి బాధ్యత పెంచుతుంది



దత్తాద్రికి స్టార్ తొడుగుతున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: పదోన్నతి మరింత బాధ్యతను పెంచుతుందని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా క్రైం రికార్డ్స్ బ్యూరోలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ సీఐగా పదోన్నతి పొందిన దత్తాద్రి జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలువగా ఎస్పీ పదోన్నతి స్టార్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో బాధ్యత, క్రమశిక్షణగా ఉంటూ ప్రజల్లో పోలీసు శాఖ పట్ల నమ్మకం, గౌరవం పెంచేలా విధులు నిర్వహించాలని సూచించారు.

అభివృద్ధి నిధులతో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతాం



జీపీ భవనానికి భూమిపూజ చేసిన జలపతిరెడ్డి

మల్లాపూర్: అభివృద్ధి నిధులతో గ్రామాలను అన్నిరంగాలలో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతామని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. సోమవారం మల్లాపూర్ మండలంలోని పాతదాంరాజుపల్లి, కొత్తదాంరాజుపల్లి గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలతో పాటు కుస్తాపూర్‌లో కిచెన్‌షెడ్ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేసి మాటాడారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, బద్దం నర్సారెడ్డి, మాజీ సర్పంచ్‌లు మైదాసు శ్రీనివాస్, మామిడాల గంగాధర్,హన్మాంతు,నాయకులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రులు, ప్రభుత్వ విప్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



పోతారంలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కథలాపూర్: మండలంలోని పోతారంలో సీఎం, మంత్రులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు సోమవారం గ్రామస్తులు క్షీరాభిషేకం చేశారు. కలిగోట నుంచి పోతారం తండా వరకు బీటీ రోడ్డుకు రూ. 5.30 కోట్లు మంజూరు చేసినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఏళ్ల నాటి రోడ్డు సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్ పులి శిరీషా, కాంగ్రెస్ నాయకులు హరిప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కోరుట్ల: రేషన్ కింద సన్నబియ్యం పంపిణీ చేస్తున్నందున సీఎం రేవంత్‌రెడ్డి, కోరుట్ల సెగ్మెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావుల చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు సోగ్రాబీ, అక్బర్‌ల ఆధ్వర్యంలో సోమవారం క్షీరాభిషేకం చేశారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌రెడ్డి

రాయికల్: బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా ఏనుగు రవీందర్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరిబాబు సోమవారం నియమక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆకుల మహేశ్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



కోరుట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



జగిత్యాలలో ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

జగిత్యాల: పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. కొత్తబస్టాండ్ చౌరస్తా వద్ద సోమవారం ఏబీవీపీ నాయకులు ధర్నా చేపట్టారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు మీడియాతో మాట్లాడారు. దాదాపు రెండేళ్లుగా 8500 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. నిరుద్యోగ యువత, నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. కార్యక్రమంలో నాయకులు రేవంత్, యశస్వి, మణిదీప్, నిఖిల్, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ర్యాలీ

కోరుట్ల: మూడేళ్లుగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక కళాశాలల నిర్వహణ కష్టతరంగా మారిందని నిరసన వ్యక్తం చేస్తూ జగిత్యాల జిల్లా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల అధ్యక్షుడు పోతని ప్రవీణ్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు మెయిన్ రోడ్‌పై ర్యాలీ నిర్వహించారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

జిల్లా వ్యవసాయ కార్యాలయం ఎదుట నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఈవోలు, ఏవోలు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయం ఎదుట సోమవారం ఏవోలు, ఏఈవోలు నిరసన తెలిపారు. కామారెడ్డి జిల్లాలో ఏఈవోగా పనిచేస్తున్న బస్వరాజు అధిక పనిభారంతో సెప్టెంబర్ 5న గుండెపోటుతో మరణించగా, ప్రభుత్వ ఒత్తిడితోనే బస్వరాజు మరణించారంటూ జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అలాగే జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ, వ్యవసాయ విస్తీర్ణాధికారులు తిరుపతినాయక్, షాహిద్‌అలీ, సురేందర్‌నాయక్, శ్రీనివాస్‌లు మాట్లాడుతూ పంట నష్టం సర్వేను వేగవంతం చేయాలని ఒత్తిడి తేవడమే కాకుండా షోకాజ్ నోటీసు ఇచ్చారని, దీంతోనే బస్వరాజు తీవ్రంగా ఒత్తిడికి గురై మరణించాడన్నారు. ఏఈవోలు, ఏవోలపై ఒత్తిడి భారాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భూమేశ్వర్, ఫిర్దోస్, శేఖర్, రాజు, ప్రశాంత్ పాల్గొన్నారు.

సత్యసాయి ఆశయ సాధనకు కృషి

కోరుట్ల/కోరుట్లటౌన్: సత్యసాయి ఆశయ సాధనలో మరింత కృషి చేస్తామని కోరుట్ల సత్యసాయి ట్రస్టు బోర్డు సభ్యులు నిర్ణయించారు. సోమవారం సత్యసాయి కోరుట్ల ట్రస్ట్ ఫౌండర్ ప్రెసిడెంట్ వేముల మాణిక్యం అధ్యక్షతన బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్టు బోర్డు సభ్యులు సత్యసాయి సూచించిన శాంతి, సత్యం, ప్రేమ, మత సామరస్యం, అహింస వంటి అంశాలను మరింత ప్రచారంలోకి తీసుకువస్తామన్నారు. ఈ సమావేశంలో సత్యసాయి ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ చింత అశోక్, కోశాధికారి గుండెటి ఆనంద్, జనరల్ సెక్రటరీ గోనె సదానందనేత, జాయింట్ సెక్రటరీ సదాశివరాజు, ప్రచార కార్యదర్శి చింత రూపలత, జీవిత ట్రస్టీస్ ఉప్పులపు భూపతి, మచ్చ మధు, దర్శనాల ఆనంద్, భీమనాతి వంశీధర్, బాలె గంగాధర్‌లు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం అభివృద్ధికి కృషి

• ఎమ్మెల్సీ ఎల్ రమణ

రాయికల్: పద్మశాలీ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. సోమవారం పట్టణంలోని పద్మశాలీ సేవ సంఘం కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరగా.. తనవంతు సహకారం అందిస్తానన్నారు. సంఘం అధ్యక్షుడు బోగ రాజేశం, కోశాధికారి ఆడెపు నర్సయ్య, ఉపాధ్యక్షుడు దాసరి గంగాధర్, యువజన సంఘం అధ్యక్షుడు సామల్ల సతీశ్, మాజీ అధ్యక్షుడు తాటి పాముల విశ్వనాథం, నాయకులు సిరిపురం రఘు, శ్రీరాముల కిరణ్ పాల్గొన్నారు.

'ఉపాధి'ని పట్టణ ప్రాంతాలకు విస్తరించాలి

జగిత్యాల: ఉపాధిహామీ పథకాన్ని పట్టణప్రాంతాలకు విస్తరించాలని, ఉపాధికూలీలకు 200 రోజులు పనిదినాలు కల్పించి రూ.700 కూలీ ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సమితి నాయకులు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు, బలహీనవర్గాల మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. గృహలక్ష్మీ పథకం అమలు చేసి రూ.2500 ఇవ్వాలని, పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెన్న సురేశ్, భూమయ్య, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు

జగిత్యాల: జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 10 న ఉదయం 10 గంటలకు జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పన అధికారి సత్తమ్మ తెలిపారు. ఫ్లిప్‌కార్ట్ సంస్థలో డెలివరీ బాయ్స్ ఉద్యోగాల కోసం 20 ఖాళీలున్నాయని, ఎస్సెస్సీ, ఆపై ఉత్తీర్ణత గల వారై ఉండాలని, జగిత్యాలలోనే పనిచేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం 7799284842 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థినులకు అవగాహన



విద్యార్థినులతో మాట్లాడుతున్న హరిణి

జగిత్యాల: విద్యార్థినులు రుతుక్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలని స్వచ్ఛభారత్ రిసోర్స్ పర్సన్ హరిణి అన్నారు. సోమవారం మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భవానినగర్‌లోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు రుతుక్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రత పాటించకపోతే వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, మహిళ సాధికారత బృందం గౌతమి, వజ్ర, సంధ్యారాణి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం మంగేళకు చెందిన కందుకూరి రాజేశం (45) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాజు కథనం ప్రకారం.. రాజేశం ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి రెండేళ్లకు ఇంటికొచ్చాడు. అప్పటినుంచి తలనొప్పితో బాధపడుతున్నాడు. మందులు వాడినా నయం కాలేదు. జీవితంపై విరక్తి చెంది ఈనెల 6న ఇంట్లో నుంచి వెళ్లి మంగేళ అటవీప్రాంతంలో క్రిమిసంహారక మందు తాగాడు. రాత్రయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించారు. గొర్రెలను మేపడానికి వెళ్లిన కాపరికి రాజేశం చనిపోయి కనిపించడంతో కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. రాజేశం కుమారుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

దసరా శరన్నవరాత్రుల పోస్టర్ ఆవిష్కరణ

కోరుట్ల: పట్టణంలోని దుర్గాదేవీ ఆలయంలో సోమవారం దుర్గా నవరాత్రుల పోస్టర్‌ను నిర్వాహకులు ఆవిష్కరించారు. నవరాత్రులను ఈ నెల 22వ తేది నుంచి అక్టోబర్ 10వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పెండేం గణేష్, పడిగెల శ్రీనివాస్, రేగుంట ప్రసాద్, దగ్గుల నర్సయ్య, అర్చకులు రాముశర్మ ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం సాధించాలి

పెగడపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం సాధించాలని పార్టీ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి అన్నారు. మండలంలోని ల్యాగలమర్రిలో సోమవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ గెలుపు కోసం కష్టపడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, లింగారెడ్డి, నరేందర్‌రెడ్డి, రాజశేఖర్, సత్యనారాయణరెడ్డి, గంగాధర్, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన మాజీ సర్పంచ్

పెగడపల్లి: మండలంలోని రామభద్రునిపల్లి మాజీ సర్పంచ్ ఎద్దు మల్లమ్మ, మహిళలు కరీంనగర్‌లోని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కొప్పుల కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ రాజేశ్వర్‌రావు, నాయకుడు సాగి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి రూ.3.60 కోట్ల నిధులను మంజూరు చేయాలని కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు సోమవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని కూల్చివేశారని, దాని స్థానంలో నూతనంగా నిర్మించే భవనానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు జెట్టి లింగం, నల్ల రాజన్న ఉన్నారు.

ఉత్సవాలు విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణంలో వినాయక నిమజ్జన ఉత్సవాలలో అహర్నిశలు కష్టపడి కృషి చేసిన బందోబస్తును విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలని పట్టణ సీఐ కరుణాకర్ అన్నారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనం బందోబస్తును విజయవంతంగా కష్టపడి కృషి చేసిన వారందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

మల్యాల: మండలంలోని ముత్యంపేట, కొండగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని సర్వాపూర్, బల్వంతాపూర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు రామన్నపేట సెక్షన్ విద్యుత్ ఏఈ ఆకునూరి శ్రీనివాస్ తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

ధ్యానంతోనే మానసికోల్లాసం

కొడిమ్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం హార్ట్ ఫుల్‌నెస్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కన్వీనర్ మంచాల కృష్ణ ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు మూడు రోజులపాటు జరిగే ధ్యాన శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంచాల కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం ధ్యానం చేయడం వలన అనేక శారీరక, మానసిక సమస్యలను దూరం చేసుకోవచ్చని, చదువుపైన ఏకాగ్రత సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. వేణు, కళాశాల స్టూడెంట్ కౌన్సిలర్ డాక్టర్ పి. తిరుపతి, అధ్యాపకులు, పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థుల్లో మానసికోల్లాసం

మల్లాపూర్: క్రీడలు విద్యార్థుల్లో మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఎంఈవో దామోదర్‌రెడ్డి అన్నారు. సోమవారం మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించినపుడే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు లక్ష్మన్న, కృష్ణస్వామి, ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి చంద్రకళ, పీఈటీలు, మండల క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ మండలస్థాయి క్రీడలు

కథలాపూర్: ఎస్జీఎఫ్ మండలస్థాయి క్రీడలు మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో సోమవారం నిర్వహించారు. విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులను జోనల్‌స్థాయి క్రీడలకు ఎంపిక చేస్తామని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, పీడీలు రవి, రాజేశ్, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వాయిదా పడ్డ క్రీడలు

కొడిమ్యాల: ఈ నెల 9 వ తేదీ నుంచి నిర్వహించనున్న ఎస్జీఎఫ్ కొడిమ్యాల మండల స్థాయి క్రీడలు వాయిదా పడ్డాయి. 12 వ తేదీన జెడ్పీహెచ్‌ఎస్ బాలికలు కొడిమ్యాలలో నిర్వహించేందుకు ఎంఈవో అయిత శ్రీనివాస్ అనుమతి తో తీర్మానించినట్లు మండల కన్వీనర్ పీడీ బూట్ల రాజామల్లయ్య, ముఖ్య సలహాదారులు బి.లక్ష్మీరామ్ నాయక్, పీడీ శివకృష్ణ తెలిపారు.

చెక్కులు పంపిణీ

బుగ్గారం : మండలంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల సుభాష్ బుగ్గారంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నగునూరి సర్వాగౌడ్, గ్రామశాఖ అధ్యక్షులు రాజన్న, పోచమ్మ కమిటీ చైర్మన్ నర్సయ్య, పోశన్న, వెంకన్న, శంకర్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆకాశంలో అపురూప వర్ణాలు



కోరుట్ల: అరగంట వ్యవధిలో ఆకాశంలో మారిన వర్ణాలు చూపరులకు అబ్బురపరిచాయి. సోమవారం సాయంం సంధ్య సమయంలో లేతపసుపు, బంగారు వర్ణంలో మెరిసిపోయిన ఆకాశం అరగంట గడిచేసరికి నీలి ఉదా రంగులో అలరించింది.



కథలాపూర్: మండలం బొమ్మెనలో జెడ్పీ హైస్కూల్ ఆవరణలో డైనింగ్ హాల్ నిర్మాణం కోసం గుంతలు తవ్వి వదిలేశారు. ఇటీవలే కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు చేరి ప్రమాదకరంగా మారింది. విద్యార్థులు అటువైపు వెళ్లితే ప్రమాదం పొంచి ఉంది. డైనింగ్ హాల్ నిర్మాణం పనులు త్వరగా ప్రారంభించాలని లేకపోతే గుంతలను పూడ్చివేసి చదును చేస్తే ప్రమాదాలు జరగకుండా ఉంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
జగదీశ్వర్,పీఆర్ ఏఈ, కథలాపూర్ సెల్ నంబర్: 9100853882

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయుడు రవీంద్రనాథ్‌ను సన్మానిస్తున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్, ఎమ్మెల్సీ

జగిత్యాల: జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన బుగ్గారం మండలం మద్దునూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ జెట్టి రవీంద్రనాథ్‌ను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సన్మానించారు. ఆయన చేతులమీదుగా రవీంద్రనాథ్ ప్రశంసపత్రం అందుకున్నారు.

రాయికల్: మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 22 మంది ఉపాధ్యాయులను సోమవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అధికారులు సన్మానించారు.

మేడిపల్లి: మండల స్థాయిలో18 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశారు. భీమారం మండలంలోని రాగోజీపేటలో ఉత్తమ ఉపాధ్యాయులకు బీజేపీ మండల అధ్యక్షుడు నాగం కుమార్ సన్మానించారు.

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది.కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

వెల్గటూర్ : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ మండల స్థాయి ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి సోమవారం వెల్గటూర్ మండల పరిషత్ కార్యాలయంలో శాలువాతో ఘనంగా సన్మానించి వారికి అవార్డులు అందజేశారు.

ఇబ్రహీంపట్నం: మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ముగ్గురిని, మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 14 మంది ఉపాధ్యాయులను అధికారులు సన్మానించి జ్ఞాపికలను అందచేశారు.

కథలాపూర్: మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు 11 మందిని ఎంపిక చేసినట్లు ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. వీరిని మంగళవారం ఎంఈవో కార్యాలయంలో సన్మానిస్తామని ఎంఈవో పేర్కొన్నారు.

కరీంనగర్ డెయిరీ రైతుల సంస్థ



డెయిరీ పార్లర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, రాజేశ్వర్ రావు

ఇబ్రహీంపట్నం: కరీంనగర్ డెయిరీ రైతుల సంస్థ అని దీంట్లో ప్రతీ ఒక్క రైతుకు భాగస్వామ్యం ఉందని కరీంనగర్ డెయిరీ చైర్మన్ చెల్మడ రాజేశ్వర్‌రావు అన్నారు. సోమవారం మండలకేంద్రంలో కొత్త బస్టాండ్ వద్ద కరీంనగర్ డెయిరీ పార్లర్‌ను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ డెయిరీలో 76 రకాల పదార్థాలను ఉత్పత్తి చేస్తున్నామని, లక్ష మంది రైతులతో 1400 గ్రామాల్లో ప్రతి రోజు 2 లక్షల పాలను సేకరించి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. డెయిరీలో ప్రతీ రూపాయి రైతులకు చెందుతుందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బద్దం గోపి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలాల ధశరత్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, నాయకులు ఎలేటి చిన్నారెడ్డి, తిమ్మణి రాములు, నేమూరి సత్యనారాయణ, నేమూరి నరేశ్, డెయిరీ పార్లర్ యాజమాని బోల్లం మహేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బతుకమ్మ కుంటకు తాత్కాలిక మరమ్మతు

సారంగాపూర్: బతుకమ్మకుంటకు తాత్కాలిక మరమ్మతులు చేపడతామని అటవీశాఖ జగిత్యాల రేంజర్ పద్మారావు అన్నారు. సోమవారం బతుకమ్మ కుంటను పరిశీలించి మాట్లాడారు. కుంట నుంచి నీరు వృథాగా పోకుండా తాత్కాలికంగా నీటికి అడ్డుకట్ట వేసే పనులు వెంటనే చేపడతామన్నారు. నిధులు మంజూరు కాగానే నీటిపారుదల శాఖ అధికారుల పర్యవేక్షణలో పనులు చేపడతామని రేంజర్ పేర్కొన్నారు. వారి వెంట బీట్ అధికారి ప్రేమ్, ధర్మపురి ఏఎంసీ డైరెక్టర్ రామడుగు రవి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోండ్ర రాంచంద్రారెడ్డి, నాయకులు చేకుట శేఖర్ తదితరులు ఉన్నారు.

యాచకురాలి సామగ్రి కుటుంబ సభ్యులకు అందజేత

మల్యాల: శ్రీ కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో యాచకురాలిగా జీవించిన పద్మ అనారోగ్యంతో మృతి చెందగా, మృతురాలి సామగ్రి నగదు కుటుంబ సభ్యులకు ఏఎస్సై రమణారెడ్డి అందజేశారు. పెద్దపల్లి జిల్లా కమాన్ గ్రామానికి చెందిన పద్మ కొండగట్టులో కొంతకాలంగా యాచకురాలిగా జీవించిన పద్మ అనారోగ్యంతో బాధపడగా, కుటుంబ సభ్యులు తమ స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఈ నెల 3న పద్మ అనారోగ్యంతో మృతిచెందింది. సోమవారం కుటుంబ సభ్యులు కొండగట్టుకు రాగా, మృతురాలికి చెందిన సామగ్రితోపాటు రూ.20,000, యాచకురాలి సహాయకురాలికి రూ.10వేలు కుటుంబ సభ్యులకు అందజేసి, అంగీకార పత్రం తీసుకున్నామని ఏఎస్సై తెలిపారు.